

# తోడొకరుండిన....

## - శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

మధ్యాహ్నం. ఎండ బాగా మాడ్చేస్తున్నది. సందీప్ పాలుతాగి వుయ్యాల్లో నిద్ర పోతున్నాడు. తల్లి పడుతున్న మానసిక క్షోభ పంచుకోవటానికి ఇంకా ఎన్ని సంవత్సరాలో వున్నాయి. అప్పటిదాకానే ఈ ప్రశాంతం.

బయట అలికిడి వినిపించి బయటికి వచ్చింది కుసుమ. ఒక నడివయస్కురాలు, పదహారేళ్ళ కుర్రాడు అరుగు మీద కనిపించారు. ఆవిడ కూర్చొని గోడకు చేరగిలబడి కళ్ళు మూసుకొని వుంది. పక్కనే అమాయకమైన మొహంతో ఆ అబ్బాయి "అమ్మా అమ్మా "అంటూ తట్టుతున్నాడు.

"ఎవరు బాబూ మీరు? ఏం కావాలి?"

"ఎండకు మా అమ్మ సొమ్మసిల్లి పడబోతుంటే ఇక్కడ కూర్చో పెట్టాను. అమ్మ తేరుకోగానే వెళ్ళిపోతాను." దీనంగా సమాధానం చెప్పాడు.

"అయ్యో పాపం వడదెబ్బ తగిలినట్టున్నది." అనుకొని లోపలికి వెళ్ళి ఒక చెంబుతో మంచినీళ్ళు రెండు గ్లాసులు తెచ్చింది. ఆ అబ్బాయి తల్లి మొహం మీదనీళ్ళు చల్లి లేపి కూర్చోపెట్టి నెమ్మదిగా మంచినీళ్ళు తాగించటంమొదలెట్టాడు. ఆవిడ చెంబెడు నీళ్ళూ తాగేసింది. కుసుమ వెళ్ళి మరిన్ని నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

ఆ అబ్బాయికూడా తాగి, తల్లి చేయి పుచ్చుకొని లేపి, "అమ్మా పోదామా?" అంటూ నడిపించబోయినాడు. ఆవిడ నెమ్మదిగా లేచి ఒక అడుగు వేయబోయి తూలి పడబోయింది.

కుసుమ గబుక్కున వచ్చి ఆవిడను పట్టుకొని అరుగు మీద కూర్చోపెట్టి, "ఏం బాబూ మీ అమ్మ చాల నీరసంగా కనిపిస్తున్నది. ఈ రోజు భోజనం చేయలేదా?"

"లేదండీ. ఈ రోజే కాదు. రెండు రోజులయింది భోజనం చేసి. నిన్నటి వరకు కాఫీ తాగి బన్ను తిన్నాము. ఈ రోజు అది కూడా లేదు."

కుసుమ వారిద్దరిని తేరిపార చూసింది. గౌరవనీయమైన కుటుంబంలో నుండి వచ్చినవారిలాగా అనిపిస్తున్నారు. ఆవిడ సాంప్రదాయమైన మనిషిలా వున్నది. నుదుట బొట్టు లేదు. పిల్లవాడి అమాయకపు మొహం, జాలి చూపులు, నీరసపడ్డ అవతారం. అభిమానంతో నిస్సహాయంగా తల దించుకున్న తల్లి.

"బాబూ! జాగ్రత్త. అమ్మను లేవకుండా చూసుకో. నేను ఇప్పుడే వస్తాను."

లోపలికి వెళ్ళిన కుసుమ గబగబా ఒక గ్లాసెడు గోధుమరవ్వ వుడికించి, రెండు పళ్ళాలలో ఒక పక్క నిమ్మకాయ వూరగాయ బద్దలు, వండిన గోధుమ రవ్వ పెట్టి, ఒక గిన్నెలో చిలికిన మజ్జిగ తెచ్చి వాళ్ళ ముందు పెట్టింది.

వాళ్ళు మహా మొహమాటపడిపోయినారు. "అయ్యో వద్దండీ, మేము వెళ్ళిపోతాము."

"అట్లాగే వెళ్ళుదురు. కొద్దిగా తింటే ఓపిక వస్తుంది. లేకపోతే మీ అమ్మ నీరసంతో కళ్ళు తిరిగి పడిపోతే ఏం చేస్తావు? అందుకనే ఈ కాస్త తిని వెళ్ళుదురు."

పాపం, ఆ మాటతో ఇంక మొహమాటం తగ్గి ఆవురావురని తింటున్న వాళ్ళకు బిడియం తగ్గించటానికి కబుర్లలో పెట్టి వారి వివరాలు సేకరించింది కుసుమ.

వాళ్ళ కధనం ప్రకారం, వాళ్ళది విజయవాడ దగ్గర ఒక పల్లెటూరు. ఇంటి యజమాని అక్కడే గుళ్ళో పూజారి. ఇళ్ళల్లో పౌరోహిత్యం కూడా చేసుకుంటూ భుక్తికి లోటు లేకుండా పిల్లవాడిని చదివించుకుంటూ వున్నారు. ఆవిడ కూడా అవసరమైన వాళ్ళకు వంటల్లో సహాయం చేస్తూ అంతో ఇంతో వెనకేస్తూ పిల్లవాడిని బాగా చదివించే ఆలోచనలో వెనకేయసాగింది. కాని విధి వారిమీద చిన్న చూపు చూసింది. ఒకనాడు ఆయన హఠాత్తుగా గుండెపోటుతో మరణించటంతో వారిద్దరి బతుకులు వీధినపడ్డాయి. అప్పటికి ఆవిడ వంటలు చేస్తూ కాలం గడుపుదామనుకున్నది. కాని ఆ చిన్న వుళ్ళో వచ్చే ఆదాయం ఏదో కష్టం మీద వారిద్దరి పోషణకు సరిపోయేది. పిల్లవాడి చదువు మధ్యలోనే ఆగిపోయేటట్టున్నది. అప్పుడే ఆ వూరి కరణంగారు సలహా ఇచ్చారు.

"హైదరాబాదులో పేదలకు వుచితంగా భోజనంపెట్టి చదువు చెప్పించే సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు వుంటాయి. అక్కడకు వెళ్ళి పిల్లవాడిని చేర్పించమ్మా."

"ఆయన సలహా మేరకు చార్జీలకు నా దగ్గర వున్నదంతా వూడ్చుకొని ఇంత దూరం వచ్చాను. నాలుగు రోజులయింది ఈ వూరు వచ్చి. మా కరణంగారు చెప్పిన వివరాలను పట్టుకొని ఎన్నో హాస్టల్లకు తిరిగాము. కాని అక్కడ కూడా మా దురదృష్టమే వెంట వచ్చింది.

ఆ హాస్టల్లన్ని వెనకపడ్డ కులాల వారికేనట. అక్కడ చేరటానికి మా కులం అడ్డం వచ్చింది. ఎవరినైనా పట్టుకొని మేము వెనకబడ్డ కులం వాళ్ళమని ఏదైనా దొంగ సర్టిఫికేట్ సృష్టిస్తే పని సానుకూల పడుతుందని వాళ్ళు ఒక సలహా కూడా ఇచ్చారు.

ఛీఛీ. చావనన్నా చస్తాము కాని వాడి చదువు కోసం మా కులం మార్చుకోవటం కన్నతల్లిని చంపినంత పాపం అనిపించింది. అందుకనే ఏదో విధంగా మా వూరు వెళ్ళిపోయి వాడికి కూడా నాతోపాటు వంటలు నేర్పిస్తే అదే జీవనోపాధిగా మార్చుకుంటాడు. ఏదో చదివిద్దామని నేను వువ్విళ్ళూరుతున్నాను కాని ఆ సరస్వతిదేవి కరుణ వాడిమీద లేనప్పుడు మేమేం చేస్తాము?"

"అమ్మా అన్నపూర్ణ తల్లి లాగా ఈ రోజు మాకు ఇంత అన్నం పెట్టి కాపాడావు. ఇది ఏ నాటి బంధమో? ఇంక బయల్దేరుతామమ్మా."

"రెండు రోజులగా అభోజనంగా వుండి ఇంత ముద్ద తిన్నారు. ఆ నీరసం ఇంకా వుంటుంది. ఇంత ఎండలో కనుక వెంటనే బయలుదేరితే ఇబ్బందిపడతారు. ఇదిగో చాప. కాస్సేపు ఇక్కడే రెస్ట్ తీసుకొని చల్లబడ్డాక వెళ్ళుదురు."

ఆలోచనలో పడ్డది కుసుమ. చూడబోతే తనది ఆ తల్లికొడుకులది ఒకటే సమస్యలా వుంది.

తనకు కావలసినది ఇంటిని చంటివాడిని చూసుకొనే తోడు. వారికి కావలసినది పిల్లవాడిని చదివిస్తూ నివసించటానికి ఒకగూడు.

కారు చీకటిలో కూర్చున్న కుసుమకు ఎక్కడో మిణుకుమిణుకుమంటూ వెలుగు కనిపించింది.

ఆలోచన వచ్చిందే తడవు లేచి వరండాలోకి వెళ్ళింది.

ఆవిడకు దిగులుతో ఆలోచనలతో నడుము వాల్చాలని కూడా అనిపించలేదు. అట్లాగే గోడకానుకొని కూర్చున్నది. పక్కనే పిల్లవాడు ఆదమరిచి నిద్రపోతున్నాడు.

అనటమైతే అన్నది కాని వూరికి వెళ్ళి ఏం చేయాలి? పిల్లవాడి భవిష్యత్తు ఏమిటి? చేతిలో చిల్లికానీ కూడా లేదు. ఇప్పుడు ఈ మహానగరం నుండి వూరికి వెళ్ళే మార్గం ఏమిటి? అన్ని ప్రశ్నలే. ముందు దారి అగమ్యగోచరంగా వుంది.

అప్పుడే కుసుమ బయటకు వచ్చింది. "ఏమ్మా పడుకోకపోయినావా?" ఆప్యాయంగా అడిగేటప్పటికి ఇంక వుండబట్టలేక, తన

కడుపులో బాధనంతా వివరించింది.

"అమ్మా మీ పేర్లేమిటి?"

"నా పేరు అలిమేలు, బాబు పేరు మోహన్."

"చూడమ్మా అలిమేలు. నా పేరు కుసుమ. నాకు ఒక మూడునెలల పసి పిల్లవాడు వున్నాడు. నా భర్త అమెరికాలో వున్నారు. మా అత్తగారికి ఆరోగ్యం బాగలేక పెద్దకొడుకు దగ్గర వున్నారు. ఇంత ఇంట్లో నేనొక్కదాన్నే పిల్లవాడిని పెట్టుకొని వుంటున్నాను. పిల్లవాడిని ఇంటిని చూసుకోవటానికి ఎవరైనా దొరుకుతారేమోనని వెతుకుతున్నాను. మీకు కనుక అభ్యంతరం లేకపోతే ఇక్కడే నా ఇంట్లోనే వుండి నా కొడుకును చూసుకుంటూ వుండండి. మోహన్ను చదివించే పూచీ నాది. అహఁ మీకభ్యంతరం లేకపోతేనే."

అనుకోని ఈ మాటలకు అలిమేలుకు నోటమాట రాలేదు. కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి. కాని వెంటనే తేరుకొని, "అమ్మా, మేమెవరమో ముక్కు మొహం తెలియదు. అంత ధైర్యంగా మాకు ఇంటి భాధ్యత పిల్లవాడిని........" అనుమానంగా అన్నది.

చిన్నగా నవ్వి,"చూడు అలివేలూ, నా అన్న వాళ్ళందరికి దూరమయ్యాను. దారి గమ్యం లేక కొట్టుకుంటున్న నాదగ్గరకు దేవుడే నిన్ను ఈ రూపంలో పంపించాడని అనిపించింది. అడిగేసాను. ఇంక భాధ్యత అంటావా? నా వద్ద విలువైనవి ఏమీ లేవు. నువ్వు నీ కొడుకు నాఇల్లు దోచుకు పోతారన్న భయం ఏమాత్రమూ లేదు. ఆలోచించుకోండి. ఇంత బతుకు బతికి చివరకు పిల్లవాడికి ఆయాగా వుండవలసి వస్తుందన్న అనుమానం వుంటే చెప్పు. నాకు తెలిసిన వాళ్ళదగ్గర ఎక్కడైనా వంటకు ఏర్పాటు చేస్తాను. నేను వేరే ఏదైనా ఏర్పాటు చూసుకుంటాను." కుసుమ ఇచ్చిన హామీకి అలివేలు పొంగిపోయింది.

"అమ్మాయీ, నిజంగా నీ వంటివారు ఎక్కడా వుండరమ్మా. ఎవరి గడపలోనైనా కాస్త సేద తీర్చుకోబోతే అంతా తరిమి కొట్టిన వాళ్ళే. అటువంటిది నువ్వేమో మాకడుపులు కూడా నింపావు. నీ కొడుకుకే కాదు నీకు కూడా సేవచేసుకున్నా నా ఋణం తీరేది కాదు. మా మీద అంత నమ్మకం వుంచిన నీ దగ్గర వుండటానికి నాకేమీ అభ్యంతరం లేదు."

"అట్లా అలిమేలూ అండలో నేనూ సందీప్ జీవితం కొనసాగించాము. మోహన్ను కూడా స్కూల్లో చేర్పించాను. సందీప్ వాళ్ళిదరికి బాగా అలవాటైనాడు. వాడు పెద్దవాడై స్కూల్కు వెళ్ళే వయసొచ్చిన తరువాత కూడా ఆ తల్లి కొడుకులు నాతోనే వుండిపోయి నా కుటుంబంలో భాగంగా వున్నారు."

★★★★★★★★★★★★★★

"మరి మీ ఆయన నుండి కబురేమీ లేదా?" కుతూహలంగా అడిగింది పూర్ణిమ.

"అప్పుడో వుత్తరం ఇప్పుడో వుత్తరం. చదువు అయిపోయి ఆయన వస్తాడు. మంచి వుద్యోగం చూసుకుంటాడు. నన్ను సందీప్ను పోషిస్తాడు అని ఓపిక పట్టాను.

అప్పుడు ఒక వుత్తరం వచ్చింది. అతని చదువు పూర్తయినట్టు, అక్కడే వుద్యోగంలో చేరినట్టు రాసాడు. త్వరలో నిన్ను సందీప్ను ఇక్కడికే పిలిపించుకుంటానని కూడా రాసాడు. పాస్పోర్ట్ సిద్దంగా పెట్టుకోమంటే ఆ ఏర్పాట్లు కూడా చేసుకున్నాను. నేనొక వెర్రి బాగులదాన్ని. అందరికి ఆ విషయమే చెప్పి మురిసి పోయాను. ఇల్లు కొంటున్నానని ఒకసారి, చలి ఎక్కువగా వున్నదని ఒకసారి, వేరేవూరికి మారుతున్నానని, సెటిలయిం తరువాత తానే స్వయంగా వచ్చి తీసుకెళ్ళుతానని, తడవకొకటిగా కారణాలు ఇస్తూ వుత్తరాలు రాసాడు."

అట్లా ఒక ఆరేళ్ళ కాలం గడిచిపోయింది. చివరకు ఒకరోజు పోస్ట్ లో నాకు సందీప్కు టికెట్లు కూడా వచ్చాయి. ఇంక నా ఆనందానికి పట్టపగ్గాలు లేవు. ఆ పాటికి మోహన్ డిగ్రీ కూడా పూర్తయింది. వాడికి ఒక వుద్యోగం చూపించి అలివేలు జీవితానికి ఒక మార్గం కూడా చూపించానన్న తృప్తి కూడా మిగిలింది.

ఆ రోజు బాంక్లో రాజీనామా లెటర్ ఇద్దామని తయారయి వెళ్ళాను. ఆ రోజే నా జీవితం పెద్ద మలుపు తిరిగింది.

★★★★★★★★★★★★★★★★★★★★★★

కుసుమ ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

కూనిరాగాలు తీసుకుంటూ పని చేసుకుంటున్న సమయంలో కౌంటర్ దగ్గరకు ఒక పెద్దమనిషి వచ్చాడు. అతనికి కావలసిన పని చేసి మళ్ళీ తలదించుకొని పనిచేసుకో సాగింది.

"అమ్మాయి, నీకు శ్రీహరి గారు తెలుసా?"

శ్రీహరి బాబాయి పేరు వినగానే ఒక్కసారి తల ఎత్తింది. "ఆ తెలుసండీ. ఆయన మాకు చాల సన్నిహితులు. వారు మీకు పరిచితులా?" వుత్సాహంగా అడిగింది.

"అమ్మా నీ పేరు కుసుమ కదూ, ఒక్కసారి ఫ్రీగా వుంటే నీతో మాట్లాడాలి. అట్లా కాంటీన్‌కు వస్తావా?" ఆ పెద్దమనిషి మొహంలో తెలియని ఆందోళన చూసి కుసుమకు శ్రీహరిగారి కుటుంబం గురించిన విషయమేమోనని అనుమానం వచ్చింది. అప్పటికే లంచ్ టైం అవటాన ఆయనతో కాంటీన్ వైపు వెళ్ళింది.

అక్కడ ఆయన చెప్పిన విషయాలు విన్న కుసుమకు కొంతసేపు నోటమాట రాలేదు. మెల్లిగా తేరుకొని, "నో, అట్లా జరగటానికి వీల్లేదు. నేను వచ్చేవారం అమెరికాకు వెళ్ళుతున్నాను. ఇదిగో మావారు నాకు పంపించిన టికెట్."అంటూ తీసి చూపించింది.

"అమ్మాయి, నువ్వు ఒక్కసారి మా ఇంటికి వస్తే నీకు చాల విషయాలు అర్థం అవుతాయి. తొందరపడి వుద్యోగం రిజైన్ చేయవద్దు."

"మీరు నన్నెప్పుడూ చూడలేదుకదా! ఎట్లా గుర్తు పట్టారు?" ఇంకా అనుమానం తీరక అడిగింది.

"అమ్మా, శ్రీహరి ఇంట్లో ఆయన కూతురు స్నేహితురాళ్ళతో తీసుకున్న ఫొటో ఫ్రేం పెద్దది వుంది. ముచ్చటగా వున్న ఆ అమ్మాయిలు ఎవరని ఒకసారి ఆయనను అడిగితే మీ వివరాలు చెప్పాడు. వెళ్ళినప్పుడల్లా ఆ ఫోటో ఎదురుగా కనబడటంతో నిన్ను సులభంగా గుర్తు పట్టగలిగాను."

మొదట్లో తటపటాయించినా కుసుమకు సిక్స్త్ సెన్స్ హెచ్చరించింది.

మురహరి అమెరికాలో పెళ్ళిచేసుకొని ఇద్దరు పిల్లలకు తండ్రి అయినాడు అని ఆయన వేసే అభాండాల నిజానిజాలు తెలుసుకోవాలంటే ఒక్కసారి ఆ పెద్దమనిషితో వెళ్ళి ఆయన చెప్పే మాటలు వినాలని నిర్ణయించుకొని ఆయనతో కారెక్కి వారింటికి వెళ్ళింది.

కుసుమకు ముందుగా మంచినీళ్ళు ఇచ్చి, "అమ్మా నేను చెప్పే మాటలు నూటికి నూరుపాళ్ళు వాస్తవాలే. ఎవరో అయితే నేను అంతగా పట్టించుకొనేవాడిని కాదు. నువ్వు శ్రీహరికి ఆత్మీయురాలవని తెలుసు. అందుకే నీ ఆత్మీయుడిగా నీ జీవితం ఇంకా నాశనం కాకూడదని ఈ విషయాలు చెప్పాల్సి వచ్చింది."

ఆయన చెప్పిన మాటల పట్టి తెలిసిన విషయాలు..........

అమెరికాకు చదువుకోసం వెళ్ళిన మురహరి, తన ప్రొఫెసర్ గారి కూతురితో ప్రేమాయణం సాగించి వెళ్ళిన ఆరునెలలలోనే పెళ్ళి చేసుకున్నాడు. అతనికి ఒక కూతురు ఒక కొడుకు వున్నారు. భార్య కూడా బాగా చదువుకున్నది. పిల్లలు కొంత పెద్దవాళ్ళయ్యారు కనుక తాను కూడా వుద్యోగం చేద్దామని నిశ్చయించుకున్నది. అక్కడ పిల్లలను చూసుకోవటానికి బేబీ సిట్టర్స్ అని దొరుకుతారు. కాని వాళ్ళకు గంటల లెక్కన చెల్లించాల్సి వుంటుంది.

అప్పటికే మురహరి తన సంపాదనలో కొంత ఇండియాలో వున్న తల్లికి అన్నకు పంపించి వాళ్ళ స్వంత వూళ్ళో ఇల్లు కొనుక్కున్నాడు. అంత పెద్ద మొత్తాలు బేబీ సిట్టర్‌కు ఇవ్వటం అంటే అతనికి భరించే శక్తి లేదు. అక్కడ వున్న ఇండియన్స్ సాధారణంగా ఇండియా నుంచే

మనుషులను పిలిపించుకొని ఇంటిపని వంటపని పిల్లల పోషణ వంటి అన్ని పనులు చేయించుకోవటం చూసాడు. అప్పుడు అతనికి వచ్చిన ఆలోచనే కుసుమను అమెరికాకు పిలిపించుకోవటం.

"ఆరు నెలల క్రితం నేనొక సైన్స్ కాన్ఫరెన్స్ మీద అమెరికాకు వెళ్ళవలసి వచ్చింది. ఇక్కడి నుండి వెళ్ళిన మన వాళ్ళకు అక్కడున్న తెలుగువాళ్ళు ఆతిధ్యం ఇచ్చారు. ఒక్కొక్కరిని ఒక్కొక్కరు గెస్ట్‌గా వుంచుకున్నారు. ఆ సందర్భంగా నేను మురహరి ఇంట్లో వుండవలసి వచ్చింది. అప్పుడు నాకు ఈ విషయాలన్నీ తెలిసాయి.

అంతే కాదు. అతను అమెరికాకు వెళ్ళిన తరువాత మళ్ళీ ఇండియాకు తిరిగి రాలేదన్న భ్రమలో వున్నావు. కాని అతడు ప్రతి సంవత్సరం భార్యాబిడ్డలతో సహా వచ్చి తల్లి అన్నను కలిసిపోతున్నాడన్న సంగతి నీకు తెలియదు. నేను వెళ్ళినప్పుడు అతను ఇండియాలో వాళ్ళ వూళ్ళో ఇంటి ముందర తీసుకున్న ఫోటోలన్ని ఘనంగా చూపించాడు." ఆగి పక్కనున్న టెలిఫోన్ సొరుగు తెరిచి,

"ఇదిగో ఇది చూపించాలనే నేను ప్రత్యేకంగా మా ఇంటికి పిలుచుకొని వచ్చాను." అంటూ ఒక చిన్న ఆల్బం చూపించాడు.

అది చూసిన కుసుమకు కళ్ళు నదీప్రవాహాలయ్యాయి. అందమైన ఇల్లు ముందర గార్డెన్ కారు. ముద్దులొలికే ఇద్దరు పిల్లలు అమెరికన్ యువతి భుజం మీద చేయి వేసి రొమాంటిక్ పోజులిస్తూ మురహరిని ఇన్ని సంవత్సరాలకు చూసింది. పెళ్ళి ఆల్బం అత్తగారి దగ్గరే వుంది. తామిద్దరు కలిసి ఒక్క ఫొటో కూడా తీసుకోలేదు. అతను దేశం వదిలిపోయిన తరువాత అతని మొహం కూడా గుర్తులేకుండా పోయింది. ఇన్నాళ్ళకు అతన్ని ఫొటోలో చూస్తుంటే ఎవరో పరాయి వ్యక్తిలాగా అనిపిస్తున్నది.

"అమ్మా కుసుమా, తను చదువుకోసం అక్కడకు వెళ్ళిన విషయం పెళ్ళి చేసుకున్న విషయం చెప్పాడు. కాని నీతో పెళ్ళి జరిగిన సంగతి చెప్పలేదు. అప్పుడే అతని భార్య వుద్యోగంలో చేరబోతున్నదని, పిల్లలను చూసుకోవటానికి ఇండియా నుండి భర్త వదిలేసిన ఒక కొడుకు వున్న అమ్మాయిని పిలిపిస్తున్నానని, ఆమె ఇంటి పని పిల్లల పని చూసుకునేటట్టు, ఆమె పిల్లాడిని చదువు భాధ్యత తాను తీసుకోబోతున్నట్టు ఎంతో గర్వంగా చెప్పాడు.

ఇక్కడకు వచ్చిన తరువాత ఒకసారి శ్రీహరి ఇంటికి వెళ్ళటం సంభవించింది. అక్కడ ఆయన కెమెరాలో మీ దంపతులకు తీసిన ఫోటో ఫ్రేం షోకేస్ లో చూసిన నేను వివరాలు అడిగితే చెప్పాడు. "చాల సంవత్సరాలు అయింది కుసుమను చూసి. అమెరికాకు భర్త దగ్గరకు వెళ్ళిపోయి వుంటుంది అనుకుంటున్నాను." అని చెప్పాడు. అది విన్న నాకు ఆశ్చర్యం కలిగింది. కాని అతనితో నేనేమీ చెప్పలేదు. నిన్ను బాంక్‌లో చూసిన తరువాత అంతా అర్ధమయింది."

"అంటే తానేమీ చెప్పకపోయిన శ్రీహరి బాబాయి తన గురించి విచారిస్తూనే వున్నాడన్నమాట. ఛీ అనవసరంగా పరువు మర్యాద అంటూ అందరినీ దూరం చేసుకున్నది. ఇప్పటికైనా ఈ పెద్ద మనిషి కనిపించాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే తన బతుకు ఏమయ్యేదో?" తలుచుకుంటేనే భయమేస్తోంది.

★★★★★★★★★★★★★★★★★★★★★

వురుము లేని పిడుగులాగా అత్తగారు బావగారు వచ్చారు.

"ఏం కుసుమా! ఇన్నాళ్ళకు భర్త దగ్గరకు వెళ్ళుతున్నావా? సంతోషమమ్మా. ఇదిగో వాడికి ఇష్టమని అమ్మ పచ్చళ్ళు పాక్‌చేయించి తీసుకొచ్చింది. బాగ్‌లో పెట్టుకో." బావగారు అన్నాడు.

"ఏం మొన్న ఎండాకాలం వచ్చినప్పుడు ఇవ్వలేదా? లేక మీ అమెరికా కోడలు మనుమలు కూడా ఇవి తినటం అలవాటు చేసుకున్నారా?" యధాలాపంగా అన్నట్టు అన్నది.

"ఆ ఇచ్చాననుకో.........."అంటూ వెంటనే తిప్పుకుంటూ, "ఎండాకాలం ఇవ్వటమేమిటి? ఎప్పుడో ఆరేళ్ళ క్రితం వెళ్ళిన వాడు మళ్ళీ

రాకనే పోతే! ఎదీ నీ సామాను సర్దటం అయిందా?ఎల్లుండేగా నీ ప్రయాణం. నీవి సందీప్‌వి బట్టలు అన్ని సర్దేసావా?" అంటూ హడావుడి చేయబోయింది.

"అయినా కోడలూ మనుమడు ఇక్కడ వుండగా అమెరికాలో ఎవరు తింటారు? అమ్మా! నీ కోడలు జోకులేయటం కూడా నేర్చుకున్నది." బావగారు నవ్వుతూ అన్నాడు.

వాళ్ళ మాటలు వినబడనట్టే, "అలివేలూ బాబుకు స్కూల్ టైం అయింది. తయారయినాడా? నేను బాంక్‌కెళ్ళుతున్నాను. వాళ్ళు ప్రయాణం చేసి వచ్చారు. ఒక గుప్పెడు అన్నం పడేసి భోజనం పెట్టు. మళ్ళీ సాయంత్రం తిరిగి వెళ్ళాలిగా!" అంటూ వెను తిరగకుండా వెళ్ళిపోయింది.

బాంక్ లో కూర్చున్న కుసుమ మనసు లావాలా వుడుకుతున్నది. "ఎంత మోసం ఎంత నాటకం. తల్లి కొడుకులు అంతా కలిసి ఆడుతున్న నాటకం. ఆ నాడు తమ్ముడికి వీడ్కోలు చెప్పటానికి వచ్చిన బావగారు మళ్ళీ తల్లిని తీసుకెళ్ళి ఇన్నాళ్ళకు వచ్చాడు. ఇంతకాలం తన అతీగతీ కనుక్కోవాలని కూడా అనిపించలేదు. ఈ రోజు తమ్ముడికి మూటలు అందించటానికి వచ్చారంటే ఎంతకు తెగించారు?

సాయంత్రం ఇల్లు చేరిన కుసుమకు బుసలు కొడుతూ హాల్లో కూర్చున్న అత్తగారూ బావగారూ కనిపించారు. సందీప్‌ను మోహన్‌తో బయటకు పంపించింది అలివేలు. తల్లి కొడుకు ఆమె మీద వంతులవారిగా విరుచుకు పడుతూ కుసుమ మీద తమకున్న కసి అంతా వెళ్ళకక్కుతున్నారు.

అదేదీ గమనించనట్టే లోపలికి వెళ్ళబోయింది కుసుమ. ఆమె వూహిస్తూనే వుంది. వాళ్ళు అంత సులభంగా వెళ్ళరు. ఏదో రాద్ధాంతం చేస్తారని, ఎదుర్కొనేందుకు సిద్ధపడే వచ్చింది.

"కుసుమా, ఆగు. ఏమిటి నీ పొగరు? పొద్దున్న అట్లా విదిలించుకు పోయావు? ఎల్లుండి ప్రయాణం పెట్టుకొని ఇంకా బాంక్‌కు వెళ్ళటం ఎందుకు? వుద్యోగానికి రాజీనామా చేయలేదెందుకు?" నిలేసినట్టే అడిగాడు బావగారు.

"అలివేలూ ఒక కప్పు కాఫీ పెట్టు తల బద్దలవుతున్నది." గదిలోకి పోబోయింది.

"ఆగు. వాడు మాట్లాడుతుంటే అట్లా విదిలించుకు పోతావేం? పెద్దా చిన్నా వుండక్కరలేదా?"

"ఏమిటి? ఇప్పుడు చెప్పండి. ఇన్నేళ్ళూ లేనిది ఆరేళ్ళకు ఇప్పుడు నా ఇంటికి రావలసిన అవసరం ఏమిటి మీకు. వచ్చింది చాలక ఏదో పెట్టింది తిని వెళ్ళక ఈ ఆగడం ఏమిటి?" సోఫాలో కాలుమీద కాలేసుకొని అడుగుతున్న కోడలిని చూసి విస్తుపోయింది అత్తగారు.

"అదికాదు కుసుమా, నిన్ను మనుమడిని చూద్దామని బాబూ అమెరికాలో తహతహలాడిపోతు ఎదురుచూస్తున్నాడు. మీరు అక్కడికి వెళ్ళిన తరువాత ఎన్నాళ్ళకు చూస్తామో అని నిన్ను చూసిపోదామని వస్తే నువ్వేమిటి కక్ష కట్టినట్టు మాట్లాడుతున్నావు. ఏదో ఆరోగ్యం బాగుండక ఇన్నాళ్ళు రాకపోయినంత మాత్రాన మనుమడి మీద కోడలి మీద అభిమానం లేనట్టేనా? మిమ్మల్ని కూడా విమానం ఎక్కించి పోదామని వచ్చాము." అత్తగారు సంజాయిషీ ఇస్తున్నట్టు మాట్లాడుతుంటే కుసుమకు అరికాలి మంట నెత్తికెక్కుతున్నట్టు వుంది.

"నేను ఎక్కడికి వెళ్ళటం లేదు. నాకు నా వుద్యోగం వుంది. నా కొడుకును నేను పెంచుకోగలను. పాపం మీరు అనవసరంగా నన్ను సాగనంపటానికి ఇంత దూరం వచ్చారు."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments